



డీఎస్సీని వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ అశోక్‌నగర్‌లో శనివారం రాత్రి మెరుపు ధర్నాకు దిగిన నిరుద్యోగులు ఆదివారం తెల్లవారుజాము వరకు అక్కడే బైఠాయించి నిరసన తెలుపుతున్న దృశ్యం. అశోక్‌నగర్ మొత్తం పోలీసుల గుప్పిట్లో ఉన్నది. ఎక్కడా చూసినా పోలీసుల గుంపే కనిపిస్తున్నది

# నిరుద్యోగులకు సీఎం క్షమాపణ చెప్పాలి

**అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి**

- 8 నెలల్లో ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు
- నాలుగు నెలల్లో 2 లక్షల జాబ్స్ ఎలా ఇస్తరు?
- రేవంత్ నోటిఫికేషన్లపై శ్వేతపత్రం ప్రకటించాలి
- ప్రభుత్వాన్ని వదిలిపెట్టం.. ప్రజా క్షేత్రంలో నిలదీస్తం
- విద్యార్థులు, నిరుద్యోగులతో కలిసి కొట్లాడుతం
- స్వర్ణకిలారి 'మేక బతుకు' పుస్తకావిష్కరణలో కేటీఆర్

హైదరాబాద్, జూలై 14 (నమస్తే తెలంగాణ): నిరుద్యోగ యువత, విద్యార్థులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకొని, వారికి సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ వెంటనే చెప్పాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. నిర్లక్ష్యంగా, నిర్లజ్జగా సీఎం తన స్థాయిని దిగజారి, దివాలాకోరుతనంతో మాట్లాడారని మండిపడ్డారు. ఎనిమిది నెలల్లో ఒక్క నోటిఫికేషన్ ఇవ్వలేని కాంగ్రెస్ సర్కారు.. నాలుగు నెలల్లో 2 లక్షల ఉద్యోగాలు ఎలా ఇస్తుందని నిలదీశారు. రేవంత్‌రెడ్డికి సత్తా, చిత్తశుద్ధి ఉంటే ఉద్యోగాలు, నోటిఫికేషన్లు, జాబ్ క్యాలెండర్‌పై శ్వేతపత్రం ప్రకటించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో స్వర్ణకిలారి రచించిన 'మేక బతుకు' పుస్తకాన్ని ఆదివారం కేటీఆర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నిరుద్యోగుల కోసం దీక్షచేసిన నిరుద్యోగ అభ్యర్థి మోతీలాల్‌ను అవమానించేలా సీఎం మాట్లాడటం తగదని హితవు పలికారు. రాజకీయ నిరుద్యోగులుగా అశోక్‌నగర్ కోచింగ్ సెంటర్లకు వెళ్లి ఉద్యోగాలు సంపాదించుకున్న రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి.. అవే కోచింగ్ సెంటర్లు, నిరుద్యోగ అభ్యర్థులను అవమానించేలా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. అశోక్‌నగర్‌లోని నిరుద్యోగులు, విద్యార్థులను సన్నాసులు అంటున్న రేవంత్‌రెడ్డి సన్నాసా? లేదా రాహుల్‌గాంధీ సన్నాసా? చెప్పాలని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్‌ను దించి కాంగ్రెస్‌ను గద్దెనెక్కించిన అదే యువత ఈరోజు ప్రశ్నిస్తున్నదని వెల్లడించారు. రేవంత్ సర్కారును వదిలిపెట్టబోమని, అసెంబ్లీలో నిలదీస్తామని చెప్పారు. విద్యార్థులు, నిరుద్యోగులతో ప్రజాక్షేత్రంలో కొట్లాడుతామన్నారు.



మేక బతుకు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్, ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, పెద్దింటి అశోక్, డాక్టర్ నీరజ, స్వర్ణ కిలారి

### ఇది యువత భవిష్యత్తు..

ఇది రాజకీయ పార్టీల సమస్య కాదని, లక్షల మంది యువత భవిష్యత్తుకు సంబంధించిన అంశమని కేటీఆర్ అన్నారు. ఈ అంశంలో రేవంత్‌రెడ్డి ఇగో, భేషజాలకు పోకుండా నిరుద్యోగులు అడుగుతున్న డిమాండ్లపై సానుకూలంగా నిర్ణయం తీసుకోవాలని సూచించారు. కండకావరంతో మాట్లాడటం రేవంత్‌రెడ్డి ఆపాలని హితవు పలికారు. అశోక్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్, యూనివర్సిటీలో పిల్లలను పోలీసులు ఈడ్చుకుపోతున్న విషయం వాస్తవం కాదా? అని నిలదీశారు. 'రేవంత్‌రెడ్డి ఇంకా ప్రతిపక్షంలో ఉన్నట్టుగానే మాట్లాడుతున్నారు. ఆయన సీఎం అనే విషయాన్ని గుర్తుంచుకొని మాట్లాడితే ఆయనకే మంచిది' అని సూచించారు. గ్రూప్-1 మెయిన్స్‌కు అభ్యర్థులను 1:100 నిష్పత్తిలో తీసుకోవాలని నాడు అసెంబ్లీ అడిగింది భట్టి విక్రమార్క కాదా? అని నిలదీశారు.

### సాహిత్యంతో సామాజిక చైతన్యం

సాహిత్యంతో సమాజంలో చైతన్యం తీసుకురావచ్చని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. తాను దుబాయ్ వెళ్లినప్పుడు స్వయంగా లేబర్ క్యాంపులో కార్మికుల కష్టాలను చూశానని, గుండె తరుక్కుపోయిందని చెప్పారు. వలస ఎంత వాస్తవమో.. వలసలోని దోపిడీ కూడా అంతే వాస్తవం.. అది దుబాయ్ అయినా హైదరాబాద్ అయినా ఇంకెక్కడైనా.. అని పేర్కొన్నారు. పెద్దూరు వలస కార్మికుల కోసం దుబాయ్‌లోని జైలుకు వెళ్లి కలిసి వచ్చానని కేటీఆర్ పేర్కొన్నారు. వారిని ఏండ్ల తర్వాత ఇండియాకి తీసుకురాగలిగామని గుర్తుచేశారు. ప్రస్తుతం సమాజంలో చదివే అలవాటు తగ్గుతూ వస్తున్నదని, ఈ సమయంలో మేక బతుకు పుస్తకాన్ని తీసుకురావడం హర్షణీయమన్నారు. సమాజంలో చైతన్యం, మార్పు తీసుకురాగలిగే సాహిత్యానికి మరింత మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దిశగా డిజిటల్, ఆడియో పుస్తకాల ద్వారా మరింత ప్రయత్నం జరగాలని కేటీఆర్ కాంక్షించారు.

పుస్తకావిష్కరణలో ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, పెద్దింటి అశోక్‌కుమార్, డాక్టర్ జే నీరజ, మీడియా సమావేశంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, బీఆర్‌ఎస్ నాయకులు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, తుంగ బాలు, వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

### ఎడారిలో చిక్కుకున్న యువకుడి కథే 'మేకబతుకు'

మెరుగైన జీవితం కోసం కేరళ నుంచి గల్ఫ్‌కు వలస వెళ్లి అక్కడ ఎడారిలో చిక్కుకుపోయిన నజీబ్ అనే యువకుడి కథే 'మేక బతుకు' పుస్తకం. ఈ పుస్తకానికి మాతృక మలయాళంలో బెన్యామిన్ రాసిన 'ఆడుజీవితం'. 2008లో వచ్చిన ఈ నవల బహుళ ప్రజాదరణ పొందింది. ఇప్పటివరకు 100కుపైగా పునర్ముద్రణలు పొంది మూడు లక్షల పైచిలుకు కాపీలు అమ్ముడయ్యాయి. దీనికి కేరళ సాహిత్య అకాడమీ అవార్డు కూడా వచ్చింది. ఈ పుస్తకాన్ని ఇంగ్లిషులోకి 'గోట్ డేస్' పేరిట జోసెఫ్ కోయిపల్లి అనువదించారు. ఈ పుస్తకం ఇప్పటికే ఎనిమిది భాషల్లోకి (ఇంగ్లిష్, అరబిక్, నేపాలీ, ఒడియా, థాయ్, తమిళ్, హిందీ, కన్నడ) అనువాదమైంది. మార్చి 2024లో 'ఆడుజీవితం' పేరుతో ప్రముఖ హీరో పృథ్వీరాజ్ ప్రధాన పాత్రలో సినిమాగా విడుదలై సూపర్ హిట్ అయ్యింది. ఇంగ్లిష్ నుంచి తెలుగులోకి 'మేక బతుకు' శీర్షికన రచయిత్రి స్వర్ణ కిలారి అనువాదం చేశారు. పుస్తకాన్ని అన్వీక్షికి పబ్లికేషన్స్ ప్రచురించింది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, ఇతర పుస్తకాల షాపుల్లో 'మేక బతుకు' పుస్తకం అందుబాటులో ఉంటుంది.



ఆదివారం ఉదయం ఓయూ హాస్టల్‌లో చొరబడి బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్యను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

# నేడు సెక్రటేరియట్ ముట్టడి

మొదటిపేజీ తరువాయి...

చేస్తున్నారు. ఇందులో భాగంగా సెక్రటేరియట్ ముట్టడిని భగ్నం చేసేందుకు నిరుద్యోగులను ఎక్కడికక్కడే ముందస్తు అరెస్టులు చేస్తున్నారు. చాలాచోట్ల విద్యార్థి నేతలను నిర్బంధంలోకి తీసుకున్నారు. అశోక్‌నగర్, దిల్‌సుఖ్‌నగర్, ఉస్మానియా యూనివర్సిటీలో ఉన్న విద్యార్థులను, నిరుద్యోగులను వెతికిమరీ పట్టుకుని ఠాణాల్లో వేశారు. అశోక్‌నగర్, చిక్కడపల్లి ప్రాంతాల్లోని అన్ని బుక్ స్టోర్స్, టీ స్టాళ్లను మూసివేయించారు. అశోక్‌నగర్, చిక్కడపల్లి ప్రాంతాల్లో అనధికారికంగా 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నారు. ప్రతి గల్లీలో పహారా కాస్తున్నారు. సెంట్రల్ లైబ్రరీ వద్ద గస్తీ తిరుగుతున్నారు. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లకుండా పికెట్లు ఏర్పాటు చేశారు. సెక్రటేరియట్‌కు వచ్చే దారుల్లో పోలీసులు భారీగా మోహరించారు.

### తెల్లవారుజామునే అరెస్టులు

పరీక్షలు వాయిదా వేయబోమని, పరీక్షలు రాయనోళ్లే దీక్షలు చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడంతో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం దాకా అశోక్‌నగర్, ఆర్టీసీ క్రాస్‌రోడ్, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాలు నిరుద్యోగులు, అభ్యర్థుల నిరసనలతో అట్టుడికాయి. ఈ సెగ ఉస్మానియా యూనివర్సిటీకి పాకితే ఉద్యమం మరింత తీవ్రరూపం దాలుస్తుందనే అనుమానంతో పోలీసులు ఆదివారం తెల్లవారుజామునే విద్యార్థి నాయకులను అరెస్టు చేశారు. ఉదయం ఆరున్నర గంటలకు హాస్టళ్లలోకి చొరబడి టీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య, నాయకులు పెద్దమ్మ రమేశ్, సాయిలును అరెస్టు చేసి, పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

### రాజకీయాలు అంటగడుతరా?

ఉద్యోగాల కోసం ఆందోళన చేస్తున్న తమకు రాజకీయాలను అంటగడుతరా? అని నిరుద్యోగులు నిలదీశారు. పరీక్షలకు సమయం కావాలని కోరితే సీఎం రేవంత్‌రెడ్డి తమను అవమానించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దిల్‌సుఖ్‌నగర్‌లో శనివారం అర్ధరాత్రి నుంచి ఉదయం వరకు ఆందోళనలు కొనసాగించారు. నిజాయితీగా, న్యాయబద్ధంగా ఆందోళన చేస్తుంటే బీఆర్‌ఎస్, బీజేపీలను అంటగట్టి రాజకీయం చేయడం సమంజసం కాదని హితవుపలికారు.

### 16మంది అరెస్ట్.. ఠాణాలకు తరలింపు

శనివారం అర్ధరాత్రి అశోక్‌నగర్ చౌరస్తా వద్ద మెరుపు ధర్నాకు దిగిన నిరుద్యోగులు ఆదివారం ఉదయం దాకా నిరసన తెలిపారు. రాత్రంతా నినాదాలు, తెలంగాణ ఉద్యమ పాటలతో ధర్నా కొనసాగించారు. పోలీసులు, ఆదివారం ఉదయం 6 గంటల ప్రాంతంలో 16 మంది నిరుద్యోగులను అరెస్టు చేసి బొల్లారం, ఫలక్‌నుమా పీఎస్‌లకు తరలించారు.

### బీసీ నేతల నిర్బంధం

నిరుద్యోగులకు మద్దతుగా సచివాలయ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా బీసీ సంఘాల నేతలను పోలీసులు ఎక్కడివారిని అక్కడ ముందస్తు అరెస్టులు చేసి, నిర్బంధంలోకి తీసుకున్నారు. ఆదివారం ఉదయం నుంచే బీసీ సంఘాల నేతల ఇండ్లకు వెళ్లి ఫొటోలు తీసుకుని కొంత మందిని అదుపులోకి తీసుకున్నారు.

### జయప్రదం చేయండి : రాజారాం యాదవ్, ఆర్ కృష్ణయ్య పిలుపు

సెక్రటేరియట్ ముట్టడిని జయప్రదం చేయాలని బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య పిలుపునిచ్చారు. నిరుద్యోగుల ఉద్యమానికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ మేరకు హిందూ బీసీ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్ధేశ్వర్లు, విద్యార్థి, నిరుద్యోగ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కొంపెల్లి రాజుతో కలిసి తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# ఒళ్లు బలిసి దీక్ష చేస్తున్నరు

- వీళ్లకు పనీపాటా లేదు.. అవి దొంగ దీక్షలు
- నిరుద్యోగనేటోడు రోడ్లపైకొచ్చి ధర్నా చేస్తడా?
- కాంగ్రెస్ అధికార ప్రతినిధి, ఓయూ నేత దయాకర్ అహంకార వ్యాఖ్యలు



చనగాని దయాకర్



ఆదివారం అర్ధరాత్రి దిల్‌సుఖ్‌నగర్‌లో నిరసన కొనసాగిస్తున్న డీఎస్సీ అభ్యర్థులు

హైదరాబాద్, జులై 14(నమస్తే తెలంగాణ): 'ఒళ్లు బలిసి దీక్షలు చేస్తున్నరు. తిన్నది అరగక చేస్తున్నరు. వీళ్లకు పనీపాటా లేదు. నిరుద్యోగుల ముసుగులో దొంగ దీక్షలు చేస్తున్నరు. అసలు నిరుద్యోగి అనేటోడు ఇట్లా రోడ్లపైకొచ్చి ధర్నాలు చేస్తడా.' అని నిరుద్యోగ యువతపై కాంగ్రెస్ అధికార ప్రతినిధి, ఓయూ నేత చనగాని దయాకర్ చేసిన అహంకారపూరిత వ్యాఖ్యలివి! ఆదివారం ఓ చానల్ డిబేట్‌లో ఆయన నిరుద్యోగులను కించపరిచేలా మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి బాటలోనే పలువురు కాంగ్రెస్ నేతలు తమను ఇలా హేళన చేస్తూ మాట్లాడడంపై నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలనే అడుగుతున్నామని, ఆ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు ఎంతో కృషిచేసిన తమను నయవంచనకు గురిచేసిందని మండిపడుతున్నారు. రెండు మూడు రోజుల క్రితం తలకుమాసినోళ్లే దీక్షలు చేస్తున్నరని మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి శనివారం జేఎన్టీయూ వేదికగా మరోసారి నిరుద్యోగులపై అక్కసు వెళ్లగక్కారు. పరీక్షలు రాయనోళ్లు, ఉద్యోగాల కోసం పోటీలో లేనోళ్లు దీక్షలు చేస్తున్నారని హేళన చేశారు. ఆయన బాటలోనే దయాకర్ సైతం అహంకారపూరిత మాటలు మాట్లాడారు. 'ధర్నాలు చేస్తున్న వాళ్లు నిరుద్యోగులే కాదు. వాళ్లంతా రాజకీయ ముసుగు వేసుకున్నారు. దొంగ నిరుద్యోగులను తయారు చేసి ధర్నాలు చేయిస్తున్నారు. ఓయూలో నిరుద్యోగులే లేరు. అసలు నిరుద్యోగి బయటకు వస్తడా.. ధర్నాలు చేస్తడా' అంటూ కించపరిచే వ్యాఖ్యలు చేశారు.

### నాడు నానా యాగీ.. నేడు వాళ్లంతా ఏరీ?

బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో నిరుద్యోగులకు అన్యాయం జరిగిందంటూ కొందరు కాంగ్రెస్ నాయకులు, ఆ పార్టీ మద్దతుదారులు నానా యాగీ చేసిన విషయం తెలిసిందే. వీరిలో ప్రస్తుత ఎమ్మెల్సీలు తీన్మార్ మల్లన్న, బల్మూరి వెంకట్, నేతలు మానవతారాయ్, శివసేనా రెడ్డి, రియాజ్, హర్షవర్ధన్‌రెడ్డి ముందు వరుసలో ఉన్నారు. నాడు వీళ్లంతా నిరుద్యోగ యువతను రెచ్చగొట్టి రోడ్డెక్కేలా చేశారనే విమర్శలున్నాయి. అధికారం కోసం నిరుద్యోగులను వాడుకున్న కాంగ్రెస్, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక వారికి ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. దీంతో కడుపుమండిన నిరుద్యోగులు కొద్దిరోజులుగా ప్రభుత్వాన్ని దునుమాడుతూ కదం తొక్కుతున్నారు. నాడు తమను అడ్డం పెట్టుకొని నానా యాగీ చేసిన వాళ్లంతా ఇప్పుడు ఎక్కడికి పోయారని నిలదీస్తున్నారు. ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు అంటున్నట్టుగా నాడు వాళ్లు కూడా దొంగ దీక్షలు చేశారా? అని ప్రశ్నిస్తున్నారు.



బారి అశోక్ కుమార్

### సెక్రటేరియట్ ముట్టడికి మద్దతు

**తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ (టీఎస్‌పీ) సంపూర్ణ మద్దతు**

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 14 : విద్యార్థి, నిరుద్యోగ, బీసీ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించనున్న సెక్రటేరియట్ ముట్టడికి తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్(టీఎస్‌పీ) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బారి అశోక్‌కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. డీఎస్సీ వాయిదాతోపాటు గ్రూప్-2, 3 పోస్టులను పెంచి నిరుద్యోగులకు న్యాయం చేయాలని తలపెట్టిన సెక్రటేరియట్ ముట్టడిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# నిరుద్యోగులే గద్దె దింపుతారు

- అణచివేయాలని చూస్తే అగ్గిపుట్టిస్తం
- మీరు మాట్లాడితే ఉద్యమం.. బీఆర్‌ఎస్ మాట్లాడితే కుట్రనా?
- నిరుద్యోగుల ఆత్మగౌరవం దెబ్బతీసేలా సీఎం వ్యాఖ్యలు
- నిరుద్యోగులకు బీఆర్‌ఎస్ మద్దతు
- బీఆర్‌ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి



హైదరాబాద్, జూలై 14 (నమస్తే తెలంగాణ): ఊరూరా తిరిగి కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసిన నిరుద్యోగులే ఆ పార్టీని గద్దెదింపుతారని బీఆర్‌ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి హెచ్చరించారు. నిరుద్యోగులు ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద దీక్ష చేయడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. తెలంగాణ గడ్డ మీద పుట్టిన ప్రతిబిడ్డకు తెగింపు, తెగువ ఉంటాయని, అణచివేయాలని చూస్తే అగ్గి పుట్టిస్తామని హెచ్చరించారు. తక్షణమే వారి డిమాండ్లను నెరవేర్చడానికి చర్చలు జరపాలని సూచించారు. ఆదివారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. నిరుద్యోగుల వెనుక బీఆర్‌ఎస్ ఉండి కుట్రలు చేస్తున్నదంటూ ముఖ్యమంత్రి ఆరోపించడం సిగ్గుచేటు అని పేర్కొన్నారు. సీఎం వ్యాఖ్యలు చీప్‌గా ఉన్నాయని, ఆయన స్థాయికి తగ్గట్టుగా లేవని మండిపడ్డారు. నిరుద్యోగుల ఆత్మగౌరవం దెబ్బతినేలా మాట్లాడటం తగదని హితవు పలికారు. నాడు కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగుల కోసం మాట్లాడితే ఉద్యమం.. ఇప్పుడు బీఆర్‌ఎస్ పార్టీ మాట్లాడితే కుట్రనా? అని నిలదీశారు. అశోక్‌నగర్‌లో జరిగిన నిరసన నిరుద్యోగుల చైతన్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. నిరుద్యోగులు తిన్నది అరగక దీక్షలు చేస్తున్నారని కాంగ్రెస్ నేతలు మాట్లాడటం తగదని మండిపడ్డారు. మోతీలాల్‌నాయక్, బక్క జడ్సన్, అశోక్ ఆమరణ నిరహార దీక్షలు చేస్తే వాళ్లు ఏం పరీక్షలు రాశారని సీఎం అనడం ఏమిటని ఆగ్రహం వ్యక్తంచేశారు. 2023 వరకు బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై కొట్లాడిన రేవంత్‌రెడ్డి నాడు ఏ పరీక్ష రాశారో చెప్పాలని నిలదీశారు. నీట్ గురించి మాట్లాడిన రాహుల్ గాంధీ ఆ పరీక్ష రాశారా? అని ప్రశ్నించారు. నిరుద్యోగులకు బీఆర్‌ఎస్ మద్దతు కచ్చితంగా ఉంటుందని స్పష్టంచేశారు. పంచాయతీ కార్మికులు, 108 సిబ్బంది ఎవరు పోరాటం చేసినా మద్దతు ఇస్తామని తెలిపారు.

### గ్రూప్-2కు డీఎస్సీకి ఒక్కరోజే తేడా

గ్రూప్-2 పరీక్షకు, డీఎస్సీ పరీక్షకు ఒక్క రోజు మాత్రమే తేడా ఉన్నందునే డీఎస్సీకి ప్రిపేర్ అయ్యేవాళ్లు వాయిదా వేయాలని కోరుతున్నారని రాకేశ్‌రెడ్డి చెప్పారు. డీఎస్సీ, గ్రూప్-2 పరీక్షలు వాయిదా వేయాలని కోరిన కోదండరాం కూడా అజ్ఞానా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తున్నదని, ఉస్మానియా యూనివర్సిటీలో పోలీసులు కవాతు చేస్తున్నారని మండిపడ్డారు. జర్నలిస్టులపై పోలీసులు దాడులు చేస్తున్నారని, రాష్ట్రవ్యాప్తంగా శాంతిభద్రతలు అదుపు తప్పాయని విమర్శించారు. 'రేవంత్‌రెడ్డిది ప్రజాపాలన కాదు. పోలీసుల పాలన, పరిపక్వత లేని పాలన. పైశాచిక పాలన, పైరవీల పాలన' అని ధ్వజమెత్తారు. ప్రజాపాలన అని చెప్తున్న రేవంత్‌కు ఇంత పంతం ఎందుకు? అని నిలదీశారు.

# రేవంత్‌రెడ్డి సీఎం పదవికి అనర్హుడు

- విద్యావ్యవస్థపై అవగాహన లేని సీఎం రాజీనామా చేయాలి
- అశోక అకాడమీ డైరెక్టర్ పాలకూరి అశోక్ డిమాండ్



హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 14 (నమస్తే తెలంగాణ): 'రేవంత్‌రెడ్డి సీఎం పదవికి అనర్హుడు. నిరుద్యోగుల కోర్కెలను నెరవేర్చకపోతే, వెంటనే సీఎం పదవి నుంచి దిగి పోవాలి. రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగులు ఇదే భావిస్తున్నారు' అని కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు అశోక్ పేర్కొన్నారు. కోచింగ్ సెంటర్ల పేరిట నిరుద్యోగులతో చెలగాట మాడుతున్నారంటూ సీఎం చేసిన విమర్శలు దుమారం రేపాయి. కోచింగ్ సెంటర్లలో వంద కోట్ల దందా అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలపై అశోక్ తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రికి కోచింగ్ సెంటర్లపైనా, పోటీ పరీక్షలపైనా, విద్యా వ్యవస్థపైనా అవగాహన లేదని పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహించే వ్యక్తి ముఖ్యమంత్రి సీట్లో కూర్చున్నారని, అందుకే ఆయనకు పాలన చేతకావడం లేదని విమర్శించారు. రేవంత్‌రెడ్డి తక్షణమే సీఎం పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో యోగ్యుడైన, చదువుకున్న మరొకరికి బాధ్యతలు అప్పగించాలని సూచించారు. నిరుద్యోగులపైనా, తన కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌పైనా సీఎం కామెంట్ చేశారని, కానీ తన దగ్గర డీఎస్సీ కోచింగే లేదని వెల్లడించారు. రెండు నెలల్లో వంద కోట్లు వస్తాయని కామెంట్ చేశారని, మరీ 2 నెలల్లో వందకోట్లు వచ్చేదుంటే... ఇప్పటి వరకు తనకు 4, 5 వేల కోట్లు రావాల్సి ఉండేదని ఎద్దేవా చేశారు. అవగాహనా రాహిత్యంతోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇలా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. నిరుద్యోగుల ఆలోచనలకు అనుగుణంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. డీఎస్సీని సెప్టెంబర్‌లో నిర్వహించి, గ్రూపు 2, 3 పోస్టులు పెంచి డిసెంబర్‌లో పరీక్షలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. అభ్యర్థులు పరీక్షలకు హాజరైనా మానసిక సంఘర్షణతో రాయలేని పరిస్థితి ఉంటుందన్నారు. గ్రూప్-1మెయిన్‌లో 1:100 నిష్పత్తి సాధ్యమేనని, 2004లో ఇదే పద్ధతిలో నిర్వహించినట్టు గుర్తుచేశారు.